క్లుప్తంగా

ఆలయ ఆవరణలో షెడ్డు



షెడ్డు పనులు పరిశీలిస్తున్న కౌన్సిలర్ మధుయాదవ్ తదితరులు

కొడంగల్: పట్టణంలోని గాడిబాయి శివాలయం ఆవరణలో షెడ్డు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్ షెడ్డు నిర్మాణ పనులు శుక్రవారం పరిశీలించారు. గాడిబాయి ఆలయం సమీపంలో భోజనశాల, వంటగది నిర్మించాలని భక్తులు ఎమ్మెల్యేను ఆయన పుట్టిన రోజున కోరారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే.. షెడ్డు నిర్మించి భక్తులకు, శివస్వాములకు అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే నిర్మాణ పనులు ప్రారంభించారు. త్వరలో పూర్తి చేసి వినియోగంలోకి తెస్తామని కౌన్సిలర్ చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కిట్టుస్వామి, స్థానికులు కురుమయ్య, గోపాల్, భీమయ్య, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో చైర్‌పర్సన్ తదితరులు

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని సూర్యప్రకాష్‌నగర్ కాలనీలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం జరిగిన ఉత్సవానికి మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు మంజుల రమేష్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మణికంఠనగర్‌లో ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభం ప్రతిష్ఠ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేడుకలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

అర్థమయ్యే విధంగా పాఠాలు చెప్పాలి



ఉపాధ్యాయుల బోధన పరిశీలిస్తున్న ప్రధానోపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని బండవెల్కిచర్ల క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రాములు, ముజాహిద్‌పూర్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుబ్యానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి వారు మాట్లాడారు. విద్యార్థులకు సరళమైన విధానం ద్వారా బొమ్మలను చూపిస్తూ వాటి ఉచ్చారణ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ అధ్యక్షుడు నాగయ్య

మర్పల్లి: మర్పల్లి మండల సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీని మండల పరిషత్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగయ్య (సిరిపూరం జీపీ), ఉపాధ్యక్షుడిగా సంతోశ (పట్లూర్ జీపీ), రాములమ్మ (శాపూర్ జీపీ), ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్ (ఘనాపూర్ జీపీ), కార్యదర్శిగా చంద్రశేకర్ (పిల్లిగుండ్ల జీపీ), ప్రచార కార్యదర్శులుగా లక్ష్మీకాంత్ (మర్పల్లి జీపీ), రాంచంద్రయ్య (బిల్‌లక్ జీపీ), కార్యవర్గ సభ్యులుగా స్వప్న, కిరణ్ కుమార్, యు. శ్రీశైలం, జి. శ్రీశైలంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు నాగయ్య మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

షాబాద్: మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని మహేశ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బోనగిరిపల్లి గ్రామానికి చెందిన లింగాల పదమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రజాసేవకుడు మహేశ్ మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత వెంకటేశ్, ఎల్లేశ్, సాయిప్రసాద్, రమేశ్, జగదీశ్, నవీన్, మధుకుమార్ తదితరులున్నారు.

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

- కోటచింత ఆలయ అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాతే ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన 105 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు, మరో 12 మందికి ఎల్‌ఓసీలను అందజేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలని సీఎం సహాయనిధి నుంచి కోట్ల రూపాయాలను ఖర్చు చేస్తుందని తెలిపారు. నియోజకవర్గంలోనే వేల మందికి కోట్ల రూపాయలను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేద ప్రజలకు సాయం అందిందని వెల్లడించారు. పేద ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వర ఆలయాభివృద్ధికి కృషి

కుల్కచర్ల: కోటచింతల బసవేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ పరిధిలోని బసవేశ్వర స్వామి దేవాలయం చరిత్రగల పుణ్యక్షేత్రం అని, ఆలయ అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. మార్చి 2వ తేది నుంచి 5 వరకు జరగబోయే బ్రహ్మోత్సవాల్లో నియోజకవర్గ ప్రజలు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. మరికల్ సర్పంచ్ పాండురంగయ్య, నాయకులు ఉదయ్, శంకర్, మల్లేశ్, నవీన్, యశ్వంత్, నరేష్, శ్రీకాంత్, చరణ్, నర్సింహులు ఉన్నారు.

సైఫ్‌ను కఠినంగా శిక్షించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోవింద్

పరిగి: పీజీ వైద్య విద్యార్థిని ప్రీతిని (టార్చర్) వేధించిన సైఫ్‌ను వెంటనే ఉరి తీయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు గోవింద్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా ప్రీతిని సైఫ్ వేధిస్తున్నాడని, ఇదే విషయంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో ఆ యువతి మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. నిందితుడికి అధికార పార్టీ నేతల అండదండలు ఉన్నాయని, అందుకే సైఫ్‌పై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. చర్యలు తీసుకొనుంటే ఇప్పుడు ఈ ఘటన జరిగుండేది కాదని వాపోయారు. వెంటనే ఏసీపీ కిషన్, కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సూర్య, సేవ్యా, పాండు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శనగల కొనుగోళ్లు

ధారూరు: మార్క్‌ఫెడ్ ద్వారా శనగలు కొనుగోలు చేస్తున్నామని కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి ఎల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్‌లోని డీసీఎంఎస్ గోదాంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, క్వింటాల్‌కు రూ.5,335 మద్దతు ధర నిర్ణయించారని, ఇదే ధరకు రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. మీ ఏఈఓ ద్వారా పర్మిట్ తీసుకురావాలని చెప్పారు. ఎకరాకు 5 క్వింటాళ్ల చొప్పున శనగలు తీసుకుంటామని వెల్లడించారు.

గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్

కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర నాయకుడు రితిక్‌రెడ్డి



సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో రితిక్‌రెడ్డి

పరిగి: సేవాలాల్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ యువజన రాష్ట్ర నాయకుడు రితిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌తండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని, వారిని ఒక్క తాటిపై నడిపించిన గొప్ప గురువు ఆయన కొనియాడారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించారని తెలిపారు. గిరిజనుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ హయాంలో ఎస్టీ సబ్‌ప్లాన్‌లను తీసుకువచ్చి, గిరిజన తండాల అభివృద్ధికి పునాది వేసిందని చెప్పారు. గిరిజనులు సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, ఆంజనేయులు, శివరాంనాయక్, తావుర్య, జగన్ తదితరులు పాల్గొన్నారు.

‘కంటివెలుగు’ వినియోగించుకోవాలి

మున్సిపల్ చైర్మన్ నరేందర్



షాద్‌నగర్: కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న నరేందర్

షాద్‌నగర్: ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో కౌన్సిలర్ పిల్లి శారదతో కలిసి కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య తెలంగాణ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, కమిషనర్ వెంకన్న, మైనార్టీ నేత జమృత్‌ఖాన్, నాయకులు శంకర్, భిక్షపతి, వీరేశ్, మల్లేశ్, పాండు, మహేశ్, ఉమాపతి, పిల్లి సాయి, విష్ణు, అశోక్, మధు, యాదిరెడ్డి, అమర్, తదితరులు పాల్గొన్నారు.

కక్కులూరులో కంటి పరీక్షలు

షాబాద్: మండల పరిధిలోని కక్కులూరులో సర్పంచ్ భూనూరి మమత కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంధత్వ రహిత తెలంగాణ సాధనే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కరుణాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, ఉపసర్పంచ్ నర్సింహులుగౌడ్, వైద్య సిబ్బంది గోపాల్‌రెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

నైపుణ్యాల వెలికితీతకు క్రీడా పోటీలు

జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: నైపుణ్యాల వెలికితీతకు క్రీడాపోటీలు ఉపయోగపడతాయని షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు హోరా హోరీగా సాగుతున్నాయి. మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం ఆయన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ... క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. పోటీలతో గ్రామాల మధ్య స్నేహ బంధాలు పెరుగుతాయన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, మునీర్, ఇమ్రాన్, సత్యం, ముత్యం, సుధాకర్‌రెడ్డి, నిర్వాహకులు కె.మహేశ్ యాదవ్, రమేశ్‌యాదవ్, ధనుంజయ్, మొయిస్ తదితరులున్నారు.

దీపం ఒలికి.. ఇల్లు దగ్ధం

తాండూరు టౌన్: దేవుడి వద్ద పెట్టిన దీపం ఒలికి, మంటలు చెలరేగడంతో ఇల్లు బుగ్గిపాలైంది. ఈ సంఘటన శుక్రవారం తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత తాండూరుకు చెందిన వెంకటమ్మ అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం ఉదయం దేవుడి పటాల వద్ద దీపం వెలిగించి, ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. అయితే సాయంత్రం ఇంట్లో నుంచి పొగలు వస్తుండటాన్ని స్థానికులు గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్థానికులు బోరు నీళ్లతో మంటలు ఆర్పేందుకు యత్నించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పేసింది. దీపం ఒలకడం వల్ల మంటలు అంటుకున్నాయని, దీంతో ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైనట్లు చెప్పారు.

పశువుల పాకగా బడి భవనం



పాఠశాల ఆవరణలో పశువులు

ధారూరు: మండల పరిధిలోని నాగారం గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. మరమ్మతు చేపట్టకపోవడంతో అది వృథాగా మారింది. దీంతో విద్యార్థులను ఉన్నత పాఠశాలలోకి మార్చారు. వృథాగా మారిన బడి భవనం ప్రహరీ కూలిపోవడంతో పందులు, పశువులకు ఆవాసంగా మారింది. కొంతకాలంగా ఆ భవనాన్ని కొందరు పశువుల పాకగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పాడుబడిన భవనాన్ని నేలమట్టం చేసి.. ఇతర పనుల కోసం వినియోగిస్తే బాగుంటుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

గ్రామాల్లో పెరుగుతున్న ఆధ్యాత్మికత

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- నురంగల్‌లో ఘనంగా కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



మొయినాబాద్: సురంగల్‌లో బోనాల ఊరేగింపు

మొయినాబాద్: గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో పునఃనిర్మించిన కట్టమైసమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్మాతిక వాతావరణం పెరగడంతో గ్రామాల్లో ప్రశాంతత వాతావరణం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనమెత్తి అమ్మవారి ఆలయానికి చేరుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ గడ్డం లావణ్య అంజిరెడ్డి, టీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, మాజీ సర్పంచ్‌లు భద్రప్ప, చంద్రయ్య, లావణ్య, రాంచంద్రయ్య, ఉపసర్పంచ్ యాదమ్మ, మాజీ ఉపసర్పంచ్‌లు అంజిరెడ్డి, జైపాల్‌రెడ్డి, నాయకులు కంజర్ల ప్రకాశ్, కొత్త నర్సింహరెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, భాస్కరాచారి, జగన్‌మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, మహేందర్‌రెడ్డి, గున్నాల గోపాల్‌రెడ్డి, షాబాద్ దర్శన్, మాణయ్య, రవియాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు ప్రశాంతతకు నిలయాలు

మొయినాబాద్ రూరల్: ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి దత్తాత్రేయ ఆలయంలో వారణాసి రామయ్య వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పటోళ్ల జనార్దన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దేవరంపల్లి మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జీవంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

దోమ: గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పాలేపల్లి, దోమ ప్రధాన రహదారిలో సీసీరోడ్డు పనులు ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ఎంటువంటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాని చెప్పారు. ఆర్‌ఆర్‌ఎం (రూరల్ రోడ్ మెయింటనెన్స్)కింద ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సహకారంతో రూ.20 లక్షలు మంజురయ్యాయని, ఆ నిధులతో సీసీ వేయిస్తున్నామన్నారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారని తెలిపారు. గ్రామస్తులు గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, గ్రామస్తులు రమేశ్, నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై అపోహలు పెంచొద్దు

తాండూరు: పోలీసులపై ప్రజల్లో అపోహలు పెంచొద్దని తాండూరు సబ్ డివిజన్ పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సబ్ డివిజన్ పోలీసు పేరిట ఒక ప్రకటన విడుదల చేశారు. శివాజీ జయంతి, యాలాల మండలంలో శివభక్తుల దాడి, మురళీకృష్ణ ఇంటిపై దాడి ఘటనల్లో చట్టపరంగానే పోలీసు వ్యవస్థ వ్యవహరించిందని ప్రకటించారు. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై అపోహలు పెంచవద్దని కోరారు. వరుస ఘటనల్లో.. చట్టం పరిధిలోనే పోలీసులు చర్యలు తీసుకున్నారని, ఉద్దేశపూర్వకంగా ఏమీ చేయలేదని పేర్కొన్నారు.

ధారూరు ఎస్‌ఐగా సంతోష్

ధారూరు: ధారూరు ఎస్‌ఐగా సంతోష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్ ట్రాన్స్‌కో విభాగంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ధారూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన నరేందర్ జిల్లా స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీపై వెళ్లారు.

మూగజీవాలను కాపాడుకోవాలి

పశువైద్యాధికారి దేవిరెడ్డి

మొయినాబాద్‌రూరల్: రైతులు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు జీవాలను ఆరోగ్యంగా కాపాడుకోవాలని పశువైద్యాధికారి దేవిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కనకమామిడి గ్రామంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నట్టల వలన జీవాల్లో రోగ నిరోధక శక్తి తగ్గి జీవాలు వ్యాధి బారిన పడి అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. రక్త హీనత కలగడం, పెరుగుదల తగ్గడం లాంటివి కలుగుతాయని చెప్పారు. కనకమామిడి గ్రామంలో 1,489 జీవాలకు నట్టల మందులు వేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా భక్తులు



మఠాధిపతులు వీరేశ్వర్ శివాచార్యుల ఆధ్వర్యంలో పాదయాత్రగా భక్తులు

కొడంగల్ రూరల్: నారాయణ్‌ఖేడ్, సంగారెడ్డి పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు మూడు రోజుల క్రితం శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్రను ప్రారంభించారు. శుక్రవారం కొడంగల్ పట్టణానికి చేరుకుని మహాదేవుని ఆలయ ఆవరణలో సేద తీరారు. హీరేమఠ్ ధనాసిరి మఠాధిపతులు వీరేశ్వర్ శివాచార్యుల ఆధ్వర్యంలో పాదయాత్రగా బయలుదేరినట్లు భక్తులు తెలిపారు. ఏటా శివరాత్రి అనంతరం వచ్చే బుధవారం రోజున పాదయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. సంగారెడ్డి, నారాయణఖేడ్, మొగంపల్లి తదితర 30పరిసర గ్రామాల ప్రజలు దాదాపు 8వందల మందికి పైగా ప్రతి సంవత్సరం పాదయాత్రగా బయలుదేరుతామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహాదేవుని ఆలయ ఆవరణలో వీరేశ్వర్ శివాచార్యుల స్వామి భక్తులకు ప్రవచనాలు చేశారు. పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్లడం ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడుతుందని వెల్లడించారు. రోజు 30నుంచి 40కి.మీ. వరకు నడుచుకుంటూ.. 15రోజుల్లో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకుంటామని భక్తులు తెలిపారు. ఇప్పటివరకు 28వ ఏడాది పాదయాత్రగా వెళుతున్నామని, ఏటా పాదయాత్రగా పుణ్యక్షేత్రానికి వెళుతూ స్వామివారిని దర్శించుకుంటామని వెల్లడించారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



జేసీబీతో పైప్‌లైన్ పనులు చేయిస్తున్న సర్పంచ్ జైపాల్‌రెడ్డి

మర్పల్లి: బీసీ కాలనీలో తాగునీటి సమస్యను శాశ్వతంగా తీర్చేందుకే కొత్తగా పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు దామస్తాపూర్ సర్పంచ్ జైపాల్‌రెడ్డి చెప్పారు. గ్రామంలోని బీసీ కాలనీ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతుండగా.. సమస్య శాశ్వత పరిష్కారానికి జీపీ నిధుల నుంచి పైప్‌లైన్ వేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. పైప్‌లైన్ పనులు పూర్తికాగానే మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి కాలనీకి తాగునీటి సరఫరా చేయిస్తామని చెప్పారు. అదే విధంగా గ్రామంలో రూ.15 లక్షల ఉపాధి పథకం నిధులతో సీసీరోడ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

శ్మశాన వాటికకు హద్దులు నిర్ణయించాలి



తహసీల్దార్ బుచ్చయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం నాయకులు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ముస్లిం శ్మశాన వాటిక సర్వే నంబర్ 1196లోని 9ఎకరాల 13గుంటల భూమిని సర్వే చేసి, హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్ బుచ్చయ్యకు ముస్లిం మైనార్టీ నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శ్మశాన వాటిక భూమిలో ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచు ఎస్ఎం.గౌసన్, ఏకె.యూసుఫ్, ఎండీ. అన్వర్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

మర్పల్లి: వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని మర్పల్లి ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆదర్శపాఠశాలలో రోడ్డు ప్రమాదాలు, బాల్యవివాహాలు, సైబర్ క్రైమ్ వంటి పలు అంశాలపై పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో దగ్గర వాహన పత్రాలు ఉంచుకోవాలని చెప్పారు. ఆడపిల్లలు 18, పురుషులు 21 సంవత్సరాలు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణకుమార్, పోలీసు సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.